# నిన్న — నేడు — రేపు

వ[illegible]మగారు చదువుకుంటూన్న గోవిందనామాలు చెవుల బడేసరికి బద్ధకంగా లేచి కూర్చుంది అన్నపూర్ణ. కిటికీ తెర బయట తెల్లటి వెలుగు తెలతెలవారటాన్ని నిరూపించింది. నెమ్మదిగా లేచి వరండాలోకి వచ్చింది. రామారావు ఓసారి పుస్తకంలోంచి తలెత్తి చూశాడు.

"రంగ వెళ్ళిపోయిందా?"

"ఆఁ వెళ్ళింది. యిప్పుడే మళ్ళా పుస్తకం అడ్డం పెట్టుకున్నాడు. రంగవచ్చి పనిచేసి వెళ్ళిందటానికి సాక్ష్యం తళతళా మెరుస్తోన్న గిన్నెలూ—చీడీలమీద నున్నటి ముగ్గుచారలూ——బూడిద తీసి శుభ్రంచేసి వుంచిన కుంపటీ—అన్నిటినీ మించి చదువులో రామారావు ఏకాగ్రతాను. అయినా ఎందుకో అలా అడిగింది అన్నపూర్ణ.

"మిమ్మల్ని గదిలోనే చదువుకోమన్నానుగా? మళ్ళా ఇక్కడికొచ్చి కూర్చున్నారేం?" అంది ఏదో కూపీ తియ్యాలన్న ధోరణిలో.

"మీరంతా నిద్రపోతోంటే నేను లైటు వేసుకు కూర్చోటం ఏం బావుంటుంది?"— అహింసావాదిలా చూశాడు రామారావు కళ్ళు పైకెత్తి.

"బావుంది. మాకులేని యిబ్బంది మీకెందుకూ?"

"ఐనా పిల్లల్నీ, నిన్నూ చూస్తుంటే నేనిక చదివినట్టే. [illegible] ఒకళ్లు కదులుతూ మెదులుతూ వుంటారు. అలా చూస్తుంటే——"

అ మాటలేమీ నమ్మకం కలిగించలేరు అన్నపూర్ణకి! "హాఁ ఇంకా ఈ చదువు యెన్నాళ్ళుంటుంది? యేప్పుడేమిటి పరీక్షలు?"

"అప్పుడే ఏక్కడ? రెండు నెలలు పైనేవుంది. ఏం? ఎందుకలా అడిగావు?"

"పరీక్ష పాసైతే ప్రమోషనొస్తుందా?"

"అబ్బే పరీక్ష పాసైనంత మాత్రాన ప్రమోషన్ రాదుగానీ– ప్రమోషన్ రావాలంటే మాత్రం పరీక్ష పాసై వుండాలి. ఏదో ఆఫీసు వాళ్ళు పెట్టారు. చదువుతున్నాం–తప్పదుగా?"

"ఊఁ బాగానే వుంది."

అన్నపూర్ణ కుంపటిలో బొగ్గులువేసి కుంపటి వెలిగించటానికి కూర్చుంది, రామారావు పుస్తకంమూసి లేచి గదిలోకి వెళ్ళిపోయాడు.

పెద్దవాడు లేచి ఇంగ్లీషు పద్యాలు కాబోలు కంఠస్థం చేసుకొంటున్నాడు. మిగతా పిల్లలు ముగ్గుర్నీ రామారావు పేరు పేరునా పిలిచి లేపటానికి ప్రయత్నిస్తున్నాడు—చంటిముండ ఏడుస్తూ తల్లిదగ్గరికి బయలుదేరింది. తిన్నగా వచ్చి వడిలో దూరిపోయింది.

"ఎందుకే వెధవ ఏడుపూ నువ్వూను. బారెడు పొద్దెక్కినా ఇంకా లేవకేం జేస్తావ్?" అంటూ కసిరేసింది అన్నపూర్ణ.

బావురుమంది చంటిముండ.

"ఓసేవ్! చిట్టితల్లీ! ఇటురా! నే నెత్తుకుంటాను. మీ అమ్మ కొడుతుంది. ఇటురామరీ!" అంటూ లాలనగా పిలిచాడు తాతగారు చంటిముండ ఏడుస్తూ వెళ్ళిపోయింది.

"అమ్మా! ఇవ్వాళ మాకు క్లాసు పరీక్ష వుందే! నేను తొందరగా వెళతాను" పెద్దవాడు లేచి వచ్చాడు.

"వెళ్ళూ! నన్నేం చెయ్యమంటావు!" అంది ఎర్రగా చూస్తూ అన్నపూర్ణ. తెల్లబోయాడు పెద్దవాడు – కిక్కురుమనకుండా పళ్ళపొడి అందుకొని పెరట్లోకి పోయాడు.

ఎర్రగా వెలుగుతున్న బొగ్గులమీద నీళ్ళుపడేసి లేచింది అన్నపూర్ణ.

"అమ్మా! కాఫీ అయిందేమో తాతయ్య అడగమంటున్నాడే!" అంటూ వచ్చింది పెద్దపిల్ల.

అన్నపూర్ణకి ఒక్కసారి కోపం ముంచుకొచ్చింది. ఛీ! పాడు బ్రతుకు! ముందుచూస్తే నుయ్యి – వెనకచూస్తే గొయ్యి! తెల్లారిందో లేదో అవురావురుమంట్లూ లేస్తారు, ఇంట్లో వాళ్ళంతా. పెద్దవాళ్ళకీ, చిన్న

వాళ్ళకీ ఈ సదుపాయాలే చెయ్యలేక చస్తుంటే.... ఇక పనిమనిషిని కూడా మానిపించేసి.... ఎలా చావటం ? ఎన్ని గంటలకి లేస్తే ఈ చాకిరీ అవుతుంది ? రంగని మానిపించకుండా వెధవ భాగోతం ఎన్నాళ్ళు ?

విసుగులేకుండా నమ్మకంగా చేసే పనిమనిషికోసం సంవత్సరాల తరబడి ఎదురుచూస్తే నిజంగా దేవుడు పంపించినట్టే దొరికింది రంగ. నిజంగా అది ఎంత మంచిదో తనకే తెలుసు. చంటిముండ చెప్పిన పని కూడా విసుక్కోకుండా చేస్తుంది. జీతానికి ఒప్పుకున్న పనులుగాక పైన ఎన్ని చెప్పినా చేస్తుంది—రంగ గడపలో కాలు పెట్టిన రెండు నెల్లనుంచి చాకిరీ తప్పించుకున్న అన్నపూర్ణ ప్రాణం హాయిగా వుంది. నిజమే.

అయితేమాత్రం.... వెధవ ఇంటి పనికి జడిసి కాపరంలో నిప్పులు పోసుకుంటుందా ? ఆ మాయదారి ఆఫీసు చదువేదో ప్రారంభించిన దగ్గర్నుంచి రామారావుని కట్టడిచెయ్యలేక పోతున్నానన్న భయం పట్టుకుంది అన్నపూర్ణని.

కొన్ని కొన్ని గుణాలు పుట్టుకతో వస్తాయి. పుడకలతో పోతాయి. అంతేగాని వాటిని మార్చాలని ప్రయత్నిస్తే అదంతా వృథాప్రయాస అవుతుంది.... రామారావు పరాయి ఆడవాళ్ళకేసి చూస్తోంటే.... ఆ చూపుల్లో... ఆశలాంటిది .... కనిపిస్తే అన్నపూర్ణకి ఎంత బాధగా వుంటుందో రామారావుకి తెలీదు. అసలు తను మరో ఆడదాని కేసి ఆశగా చూస్తున్నాడన్న సంగతి కూడా అతనికి తెలీదు. అతను అన్నపూర్ణకేసి చూస్తాడు. రోడ్డు మీద పోతున్న విశాలాక్షికేసి చూస్తాడు. ఆఫీసులో కనిపించే సుశీలకేసి చూస్తాడు.... అలాగే అలాగే రంగకేసి కూడా చూస్తున్నాడు. కొన్నాళ్ళనుంచి—అప్పుడప్పుడూ దానికేసి చూసి నవ్వటం—ఏదోపని కల్పించుకుని మాట్లాడం—దానితోనే సిగరెట్లు తెప్పించుకుని దానిముందే ఒక సిగరెట్టు అంటించటం.... అలాంటి సర్వసామాన్యమైన విషయాలన్నీ బట్టబయలుగానే జరుగుతొన్నా.... వాటిలో.... ఏవోఏవో భావాలు, గూఢార్థాలు కనిపిస్తాయి అన్నపూర్ణకి.

అలాంటి సమయాల్లో మొగుడికేసి తీక్షణంగా చూస్తూ— క్రింద

పెదవి కసిగా కొరుక్కుంటూ— సెగలా నిట్టూరుస్తూ అవకతవకగా పని చేసుకోటానికీ ప్రయత్నిస్తూ కూర్చుంటుంది అన్నపూర్ణ.

'రంగని మానిపించేస్తే....?' అన్న ఆలోచన తళుక్కున మెరిసిందోనాడు.

"అమ్మో! రంగని మానిపించేస్తే ఈ ఇంటిపనులు — చిమ్మ చీకటితో ముసలాయనకి స్నానం — తొమ్మిది గంటలకల్లా పెద్దవాడికి క్యారియర్ భోజనం—సాయంత్రంవేళ కుర్ర వెధవలు నమలడానికేదో చిరుతిండి.... నిత్యా ఇంటిల్లిపాదీ కట్టివిడిచిన గుడ్డలూ చాకిరేవూ.... దేవుడా! రంగనే మానిపిస్తే నా పాట్లు నాకురావూ? మన బంగారం మంచిదైతే అన్నట్టు... ఈయనకు బుద్ధివుండాలిగానీ ...పనిమనుషుల్ని అరికట్టగలనా. పిచ్చి అనుకొంటూ.... తనను తాను సముదాయించుకొంటూ వూరుకొంది అన్నపూర్ణ. కాని....కాని....రామారావు తెల్లారగట్ల లేచి డిపార్టుమెంటు పరీక్షలంటూ వరండాలో కూర్చుని పెరట్లో అంట్లు తోముతోన్న రంగని....వాకిలి తుడిచి నీళ్ళు చిమ్ముతోన్న రంగని.... చకచకా పనులన్నీ చక్కబెట్టుకుంటోన్న రంగని....అలా వివిధ రూపాలుగా.... వివిధ కోణాల్లోంచి చూస్తూ మురిసిపోవటం....అన్నపూర్ణ సహించగలిగేటంత కమ్మటి విషయం మాత్రంకాదు. అక్కడికీ అంది క్రిందటిరోజు— 'తెల్లారగట్లలేచి వరండాలో కూర్చోవటం దేనికీ? ఫర్వాలేదు నాకు లైటువున్నా నిద్రపడుతుంది. మీరు గదిలోనే చదువుకోండి."

'అలాగేలే' అన్న రామారావు యధాప్రకారం వరండాలో తిష్టవేసి 'అబ్బే! నువ్వు నిద్రపోతోంటే నేను లైటు వేసుకు కూర్చోవటం బావుంటుందా?.... నువ్వు కదుల్తోంటే ....నేను చదవగలనా?' అంటూ అనురాగం ఒలకబోస్తే కరిగి నీరైపోవడానికి అన్నపూర్ణేం పిచ్చిదా? వెర్రిదా? లేక తెలివితక్కువదా?— బావుంది వ్యవహారం ముదురుతోన్నట్టేవుంది— అనుకోకుండా ఉండగలదా?

నీతి నియమాలకోసం పడిచావాలన్నది ఒక్కటే అన్నపూర్ణ అభిప్రాయం కాదు, తన భర్త తన కళ్లెదుట మరో ఆడదాన్ని అదోలా

చూడటం ... ఆ ఆడదాని ఎదురు చూపుకోసం పడిగాపులు కాయటం ... అబ్బ! అది అన్నపూర్ణకు చాలా అవమానకరమైన విషయం. తన విలువ ఏమాత్రం మిగలనట్టు.... తన వునికికి అర్థమేలేనట్టు.... ఇక ఏ క్షణాన్నయినా తను చచ్చిపోవచ్చు నన్నట్టు- ఆ బాధ ఇముడ్చుకోటానికి శక్యం కానట్టు తోస్తుంది—భార్యాభర్తల మధ్య ఏ వ్యక్తి జొరబడనే కూడదు గాసీ,.... అదే జరిగితే ఇక ఆ దాంపత్యానికి ఏం మిగులుతుంది? గతంలో సుఖం, సంతోషం, తృప్తీ.... గర్వం.... ఎక్కడ విలుస్తాయి?.... అలాంటి ఆలోచనలు వస్తేనే వణికిపోతుంది అన్నపూర్ణ.

రామారావు మనస్తత్వాన్ని యిక తను మార్చలేదు. తను ప్రయత్నిస్తోన్నకొద్దీ అతను మొండివా డవుతున్నాడేమోనన్న భయంకూడా పట్టుకుంది. అతన్ని విమర్శించి బాధపెట్టేకన్నా సాధ్యమైనంతవరకూ అతని మనస్సు చలించే అవకాశాలు లేకుండా చూసుకోవటమే తన విధి-రంగని మానిపించేయాలి! మరేం చేస్తుంది? రంగని అతని ఎదురుగా తిరగనిచ్చి.... అతనిలో రోజురోజుకీ ఆశ పెరగనిచ్చి.... చివరికి తన హృదయంలోనే అగాధాన్ని తవ్వుకుంటుందా!—మనశ్శాంతి ముందు ఈ యింటి చాకిరీ అన్నది ఎంత చిన్న విషయం! అన్నపూర్ణ మనసు చాలావరకు నెమ్మదించింది. చెల్లాచెదరైన ఆలోచనలు కూడా తిరిగి ఒక కొలిక్కి వచ్చాయి. గబగబా కాఫీలు.... పిల్లలకు చద్దన్నాలు.... వంటా వార్పూ.... తేలిగ్గా బంతిలా తిరిగింది. పదిగంటలయ్యేసరికి అన్నపూర్ణ వెనకాల తిరిగే చంటిముండ తప్ప యింట్లో ఎవ్వరూ లేరు.

అన్నపూర్ణ చంటిదానికి ముందుజడ అల్లుతూ కూర్చుంది. రంగ వచ్చింది. రెండోసారి మళ్ళా గిన్నెలు కడిగి, బట్టలు ఆరవేసి ఏమైనా పెడితే తిని పోవటం దానికి రివాజు.

అన్నపూర్ణ చాలా సేపు కొత్తమనిషిని చూస్తోన్నట్టే చూసింది రంగని. రంగ తొడలు కన్పించేలా గోచీ పెట్టుకుంటుంది. పయిట చెంగు కూడా బారుగా లాగి బొడ్లో దోపుకుంటుంది. జుట్టు మాత్రం ఎప్పుడు చూసినా నున్నగానే ఉంచుకుంటుంది. అప్పుడప్పుడు రింగు

ముడికూడా వేసుకుంటుంది. చెప్పొద్దూ ! రెండు మూడుసార్లు అన్నపూర్ణే చుట్టింది కూడాను.

"కాస్త సబ్బుపెట్టి మొహం తోముకోవే, బొత్తిగా జిడ్డు కారుతోంది" అంటే అది సరదాకొద్దీ సబ్బుతో మొహం అరగతోముకుంటుంది. కడుక్కు వచ్చాక చూస్తే నిజంగా దాని నుదురు, చెంపలూ నల్లగా నిగనిగలాడుతూ నీడలు కన్పించేంత నున్నగా వుంటాయి.

"నువ్వు చక్కగా వుంటావే రంగా ? నీ మొగుడెప్పుడన్నా ఈ మాటన్నాడా నీతో ?" అంటే ముసిముసిగా నవ్వుతుంది. పాపం రంగ చాలా మంచిది.

ఎంత మంచిదైతే ఏందుకు—తన కొంపతీశాక.

రంగ పరపరా గిన్నెలు తోముతోంది నారింజచెట్టుకింద. అన్నపూర్ణ చంటిదానికి రిబ్బను వేస్తూ అంది. "కాస్త బాగా తోమవే తల్లీ ! పొద్దున్న గిన్నెలన్నీ మసిమసిగా వదిలేసి వెళ్ళావు. గ్లాసులవీ ఎలా కడిగావో ఏమిటో తడి ఆరేసరికి బూడిద పళ్ళాల్లా తయారయ్యాయి. అన్నీ తిరిగి తొల్చుకోలేక చచ్చాను, నీ పనీ నువ్వూను."

అన్నపూర్ణ ఆ మాట లనటానికి ఎంత కష్టపడి గొంతు పెగుల్చుకొందో రంగకి తెలీదు. అది నమ్మలేనంత ఆశ్చర్యంగా వెనక్కి తిరిగి చూసింది.

"అదేమిటి ? చోద్యంగా చూస్తున్నావు ? గిన్నెలు సరిగ్గా తోమమన్నానుగానీ...."

అది రంగ నిజాయితికే తీరని కళంకం—అలాంటి విషయాలలో మాత్రం అది మంచితనం ప్రదర్శించదు. ఖచ్చితంగానే అంది "నాను సుబ్బరంగా తోమినానమ్మా !"

"అయితే నేను అబద్ధమాడానంటావా ? ఇది మరీ బావుంది. 'డబ్బూ పోయే .... శనీ పట్టే' అని. చెప్పి చేయించుకోటానికి కూడా దిక్కు లేదా ఏమిటి ?"

"మీ రెప్పుడన్నా ఈ ముక్కన్నారా ఏంటమ్మా ?"

"ఎందుకంటానూ ? ఈ మధ్య నీకు కాస్త బిరుసెక్కిందిలే. దిక్కులు చూడ్డంతో సరిపోతుంది గానీ పనేం చేస్తావూ ?"

రంగ గిన్నెలు కడగటం మానేసి భరించలేనంత అభిమానంగా చూసింది.

"ఎందుకీ గోలంతాను ? మీకిష్టంలేదని చెప్పండమ్మా !" అంది నిష్టూరంగా.

"చెప్తే ఏం చేస్తావూ ?"

"ఇంకేం చేస్తాను ? మానుకుంటాను."

"బావుందేవ్! బెదిరిస్తున్నావా ? నీకు మరోయిల్లు దొరక్కపోదు– నాకు మరో మనిషీ దొరక్కపోదు. నీకు కష్టంగా వుంటే ముమ్మాటికీ మానెయ్యి."

తెల్లబోయింది రంగ–అన్నపూర్ణమ్మ అంత ఖచ్చితంగా మాట్లాడుతుందని అనుకోలేదు. అది నిజాయితీగా పనిచేస్తుంది. దాని పనికి వంకపెడితే కోపంవస్తుంది—"యిష్టంలేకపోతే మానుకుంటానమ్మా ! అంతేకానీ...." అంటూనే వుంటుంది అప్పుడప్పుడూ.

ఆ మాటతో లొంగిపోయే అన్నపూర్ణ ఈసారి మాత్రం రెచ్చిపోయింది—తన సంతోషాన్ని కప్పిపుచ్చుకుంటూ — "చీటికీ మాటికీ మానేస్తానని బెదిరిస్తోంటే ఎంతకాలం సాగదియ్యగలను నేను ? నాకేనా అంత సిగ్గులేంది ? నేను మాత్రం ఆడపుట్టుక పుట్టలేదుటే ? నీమాత్రపు పని పాటలు నాకు రావనుకున్నావా ఏమిటి ? పన్నెత్తి మాట అనకుండా చేయించుకునే వాళ్ళదగ్గరకెళ్ళు .... ఇవ్వాల్టికి నీకు రెండున్నర కాబోలు అయింది. ఇవిగో డబ్బులు, తీసుకో" అంటూ డబ్బులు తెచ్చి చీడీవారన పెట్టింది.

రంగ మళ్లా తెల్లబోయింది – కాసేపటికి అదోలా నవ్వేసింది. రంగ మంచితనం అన్నపూర్ణకి తెలిసినట్టే, అన్నపూర్ణ మంచితనం రంగకి తెలుసు.

"ఏటమ్మా అంత కోపం ? నా నేమన్నానని ?" అంది.

"కోపం ఎవరికే ? నాకా ? నీకా ? మాటంటే మాటే. మర్యాదగా వెళ్ళు"—రంగతో అంత నిర్మొహమాటంగా మాట్లాడగలనని ఎన్నడూ అనుకోలేదు అన్నపూర్ణ — ఆ మాటలనేసి చంటిదాన్ని చంకనేసుకుని గదిలోకి పోయి కూర్చుంది. రంగ అక్కడే .... చీడీదగ్గరే నించుని .... డబ్బులు తీసుకుని రొండిన దోపుకుని...."అమ్మా ? ఎల్తన్నాను" అనేసి దొడ్డి గుమ్మం తీసుకుని వెళ్ళిపోయింది.

అన్నపూర్ణకి పుట్టెడు దుఃఖం వచ్చింది. అలా కూర్చుని కూర్చుని పన్నెండు గంటలకి పిల్లలు వచ్చేవేళకి లేచింది.

*　　　*　　　*

మర్నాడు....

ఎప్పటిలాగే లేచివచ్చింది అన్నపూర్ణ. రామారావు చదువుకొంటూనే ఉన్నాడు — అన్నపూర్ణని చూస్తూనే "రంగ రాలేదేం యివాళ?" అన్నాడు—అన్నపూర్ణ ఆతనికి దగ్గిరగా వెడుతూ "యిల్లెక్కువయ్యాయట మానేసింది. అప్పలమ్మని రమ్మని చెప్పాను. కాసేపటికి వస్తుంది," అంది. మొగుడి మొహంలో ఏదో బాధ .... కళ్ళల్లో ఏదో నిరాశ కని పిస్తుందని తరిచి తరిచి చూసిన అన్నపూర్ణకి అవి కనిపించినట్టే అయ్యాయి.

"ఏం ! మీకేం బాధగావుందా ?" అంది నవ్వుతూ.

"నాకేం బాధ మధ్య ?"

"ఏమో! చీటికీ మాటికి సిగరెట్లకి పరిగెత్తేదిగా చిలకలా !"

రామారావు మాట్లాడలేదు.

ముసలాయన లేచి వచ్చాడు — "అమ్మాయ్ ! ఇవ్వాళ రంగ రానట్టుందే !"

"అవును మామయ్యా ! దానికి వీలు కావటంలేదని మానేసింది అప్పలమ్మ వస్తుందిలెండి. మీ స్నానానికి నేను నీళ్ళు పెడతాను, తుండు చుట్టుకురండి."

రామారావు గదిలోకి వెళ్ళిపోయాడు. పిల్లలంతా లేచారు. అన్నపూర్ణ అంట్లగిన్నెలన్నీ పెరట్లోకి జేరవేసింది. సగం సగం పనులు అవుతోంటే వచ్చింది అప్పలమ్మ.

"ఇంకా స్త పెందరాడే వస్తూవుండగలవా అప్పలమ్మా!" నెమ్మదిగా అంటూ ప్రాధేయపడుతోన్నట్టు చూసింది అన్నపూర్ణ.

"ఎట్ట తీరద్దమ్మా? సూత్తా లెండి" ప్రధానమంత్రి పోజు!

కిక్కురు మనలేదు అన్నపూర్ణ. అసలుజీతంకన్న ఓ అర్ధరూపాయి ఎక్కువ పెంచి.... అది కాదుకూడదంటే ఏవేళకైనాసరే వచ్చి పనిచెయ్యమని అప్పలమ్మని తనే బ్రతిమలాడింది గత సాయంత్రం. ఏరికోరిదాన్నే పిలవటానికి కారణం ఒక్కటే.... అది పడుచుదికాదు. రామారావు దానికేసి చూడమన్నా చూడడు. అప్పలమ్మకి యాభయ్యేళ్లు నిండివుంటాయి. తల అక్కడక్కడ నెరిసి కలనేత బట్టలా వుంటుంది. రవిక తొడుక్కోదు. రంగలా అంత శుభ్రంగానూ వుండదు—రామారావు దానికేసి ఎందుకు చూస్తాడు?

నిజంగా రామారావు ఆ మర్నాటినుంచీ వరండాలో చదవటం లేదు. అన్నపూర్ణ ఏదో అడగాలని ఊరుకొంది.

* * *

చెప్పవచ్చే దేమిటంటే పాపం అప్పలమ్మకూడా ఓ కొత్త సమస్య అయింది అన్నపూర్ణకి. అది రంగ చేసే పనిలో నాలుగో వంతుకూడా చెయ్యదు సరిగదా....చిరాకులూ....కోపాలూ....కీచులాటలూను. వాటన్నిటినీ ఏమంతగా పట్టించుకోనేలేదు అన్నపూర్ణ.

కాని....వున్నట్టుండి అప్పలమ్మతో ముసలాయన సరసాలూ.... ఆ ధోరణి చూస్తోంటే మహదాశ్చర్యంగా వుంది అన్నపూర్ణకి—ముసలాయన పూర్వధోరణి చాలావరకు మారినట్లేవుంది. ఎప్పుడూ వీధిలో కూర్చుని పురాణాలు వల్లెవేసుకునే ఆయన ఉలిక్కిపడ్డట్టు దొడ్డికేసి తొంగి తొంగి చూడ్డం... స్నానం చేస్తూచేస్తూ .... గోవిందనామాలు చదువుతూ

మధ్య మధ్య అప్పలమ్మతో కబుర్లాడటం .... చమత్కారాలు దొర్లిస్తూ చురుకు చురుగ్గా దానికేసి చూడటం.........అంతా అయోమయంగా వుంది అన్నపూర్ణకి.

ఆయన వయసు కాలంలో చాలా విచ్చలవిడిగా తిరిగిన మనిషని ఎప్పుడో రామారావే చెప్పగా విన్నదేకాని ఆయనలో అలాంటి తత్వాన్ని అన్నపూర్ణ ఎన్నడూ చూడలేదు.

ఇన్నాళ్ళకి అప్పలమ్మ ఎదట ఆయన తీరు చూస్తోంటే అన్నపూర్ణకి ఏమిటో ఏవగింపులాంటిది కలిగింది. దేవుళ్ళతో సమానంగా ఎంచుకోవాల్సిన పెద్దవాళ్ళు....ఏవేవో తహతహలతోటి ....తాపత్రయాల తోటీ వేగిపోవటం .... అపవిత్రంగా, అమానుషంగా తోచింది అన్నపూర్ణకి.

"తాతగారూ నీళ్ళు తోడినాను" అంటుంది అప్పలమ్మ.

"ఆహా ! నువ్వు మహా కన్నెపిల్లవైనట్టు....తాతగారూ అంటావ్ నన్ను"—అంటూ వెటకారంగా నవ్వుతా డాయన.

"అదేటిబాబూ ! తాతగారంటే తప్పా ? ఏం ? నువ్వేం సిన్న కుర్రోడివా ?" రెట్టిస్తుంది అది.

"అదిగో! అదే వద్దన్నాను. నువ్వు నన్నిలా పిలవడం యేమిటి ? అయ్యగారూ అనలేవూ !" నవ్వుతూనే కోప్పడతా డాయన.

"ఏటిబాబూ నీదంతా సోద్దెం" అంటూ నవ్వుకొంటుంది అప్పలమ్మ. ఈ సంభాషణ వాళ్ళిద్దరిమధ్యా రోజు కోసారయినా జరుగుతూ వుండాల్సిందే—అన్నపూర్ణ విని ఊరుకొంటుంది.

ఓ రోజు అప్పలమ్మ నిచ్చెనమీద నిలబడి గది గోడలు దులుపుతోంది. ముసలాయన హడావిడిగా వచ్చాడు. "వొసేవ్ అప్పీ ! నీ నడ్డి మీదికి....అదిగో అదిగో....తేలుపిల్ల కాబోలు ఎగబాకుతోందే !".... అప్పలమ్మ కెవ్వుమంటూ చీపురు విసిరేసి దభీమంటూ కిందికి బోర్లా పడింది. కంగారుగా పరుగెత్తుకు వచ్చిన అన్నపూర్ణ ముసిముసి నవ్వులు నవ్వుకొంటూన్న ముసలాయన వాటం కనిపెట్టి మొహం చిట్లిస్తూ .... కాస్త దురుసుగానే అంది—

"నయం. నిజమే కాబోలనుకున్నాను నేను. పనిమనిషితో మీకా పరాచికాలేమిటి? దాని అంతరం యెక్కడా? మీ అంతరం యెక్కడా? బావుంది వరస."

అప్పటికీ ముసలాయన నవ్వుతూనే "నేనేం పరాచికాలాడానే అమ్మాయ్? దాని కొంగుమీద ఏదో తేలుపిల్లలా పాకుతోన్నట్టేచూశాను. గుడ్డలో జొరబడిందేమో చూసుకొమ్మను" అన్నాడు.

"అమ్మో! అమ్మో! ఎక్కడమ్మో"—అంటూ అప్పలమ్మ భయంతో గడగళ్ళాడుతూ కుచ్చెళ్ళన్నీ ఊడలాక్కుని పంచెగుడ్డ పరిచి పెట్టి చూసుకొంటూంటే అన్నపూర్ణ లోపలికి పరిగెత్తింది.

తేలుపిల్ల కంట పడనూలేదు. ఇంటి దులుపు పూర్తికానూ లేదు. అప్పలమ్మకు మాత్రం ముసలాయనమీద కోపం రాలేదు. "ఏంటిబాబూ! నువ్వూ నీ ఆసికాలూనూ," అంటూ తిప్పుకొంది. నయం — అది దెబ్బ లాడుతుందేమోనని అన్నపూర్ణ హడలిపోయింది.

మధ్యాహ్నం పిల్లలు తింటారని వుప్పుడుపిండి చేసింది అన్నపూర్ణ. ముసలాయనకి పిల్లలకీ వడ్డించింది కూడాను. అంట్లు తోమి వెళ్ళటానికి సిద్ధమవుతోన్న అప్పలమ్మతో "ఒక్క క్షణం ఆగు, పిల్లలు తిన్న కంచాలు కడిగి కాస్త ఉప్పుడిపిండి నోట్లో వేసుకు పోదువుగాని" అంది.

అప్పలమ్మ గోడవారన చతికిల బడింది.

"అప్పీ! మా తాత పిలుస్తున్నాడే!" అంటూ వచ్చాడు రెండో వాడు.

"ఎందుకూ?" అంది అన్నపూర్ణ.

"ఉప్పిండి తింటానికి" అంటూ పరిగెత్తాడు వాడు.

అంతలోనే "ఒసేవ్ అప్పీ! యిలావచ్చి పట్టుకుపో!" అంటూ అరచాడు ముసలాయన.

అన్నపూర్ణ చటుక్కున లేచి గుమ్మం దగ్గిరకెళ్ళి — "ఏవిఁటీ! దానికి నేను పెట్టాను!" అంది.

"పోనీ తిననిద్దూ! నా కెలాగూ ఎక్కువవుతుందని ఓ గుప్పెడు తీశాను" అంటూ ఆ కంచంకాస్తా గుమ్మం యివతల పడేస్తే అప్పలమ్మ అందుకుని, ఓ కాయితంలోకి వొంపుకుని కొంగులో కట్టుకుంది. తనకేదో ప్రత్యేక బహుమతి అయినట్టు.

అన్నపూర్ణ ఏమీ మాట్లాడలేకపోయింది. మళ్ళా తన తరఫున ఒక పొట్లం దానిచేతికి అందించింది—"పొద్దుటపూట కాస్త తొందరగా వస్తూవుండు అప్పలమ్మా!" అంటూ హెచ్చరించి సాగనంపింది. మర్నాడు చిమ్మచీకటినుంచే చినుకులూ, ఈదురుగాలీ పట్టుకున్నాయి. అప్పలమ్మ రానేలేదు—'అప్పి రాలేదే! అప్పిరాలేదే!' అంటూ ముసలాయన గోవిందనామాలు మానేసి తారట్లాడుతూ తిరిగాడు. అన్నపూర్ణ ఇంటిపనుల్లో సతమతమవుతూ పట్టించుకోకుండా ఊరుకొంది....మధ్యాహ్నం సన్నసన్న చినుకుల్లో నాలుగు గంటలవేళ వచ్చింది అప్పలమ్మ.

దాన్ని చూస్తే ఏమిటో మహదానందమైంది ముసలాయనకి. "ఎంతవాన కురిస్తేమాత్రం నువ్వు రాకపోతే యింటెడు చాకిరీతో పిల్ల వెధవలతో అదెలా దేవుళ్ళాడుతుం దనుకున్నావ్? బావుందే నీ వరస, ఇంటి దగ్గిర వెచ్చగా పడుకున్నావు కాబోలు" అంటూ మొహమంతా నోరుచేసుకుని కోప్పడ్డా డాయన.

అప్పలమ్మ గబగబా పని అయిందనిపించింది. చినుకులు ఎక్కువై వర్షం ధారల్లా పడుతోంటే వెళ్ళలేక వరండాలో కూర్చుంది.... ముసలాయన కాయితం పడవలు చేసి చంటిదాని చేతికిస్తూ వరండాలోనే కూర్చున్నాడు.

అన్నపూర్ణ గదిలోకి పోయింది.

"పాడుముండ వాన! తగ్గిపోద్దనుకున్నాను. సీకటి పడిపోతోంది—కొంపకెలా సేరటం!" అప్పలమ్మ స్వగతం చెప్పుకుంది.

ముసలాయన ఓ అడుగు దానికేసి వెయ్యటం చూసింది అన్నపూర్ణ.

"ఇక్కడ వుండిపోరాదుటే రాత్రికి."

"అమ్మో! ముసిలోడో....గుడిసిలో ఒక్కడూ...."

"ఐతే వానని తిడతావెందుకూ ! పోరాదూ !"

"ఈ వానలోనే! తడిసిపోనూ ?"

"తడిస్తేనేం, వాడున్నాడుగా! వెచ్చ....వెచ్చగా....కావిటేసుకుని, మంచం వుందా! చాపగుడ్డా!"

అన్నపూర్ణ నిర్ఘాంతపోయింది....తన మామగారు....ఆ విధంగా మాట్లాడగలడంటే .... కనీసం తను వింటుందన్న ఇంగితం కూడా లేకుండా....

అప్పలమ్మకి కూడా చాలా కోపం వచ్చినట్టుంది. "ఏటిబాబూ! నీ ఊసులూ నువ్వూనూ" అంది చురచురా చూస్తూ.

"ఒసేయ్ ! నీకు నిజంగా అంతకోపం వచ్చిందంటే ? తెచ్చు కున్నావ్ గానీ...."

"నీ ఒళ్ళు బారకించిందేటి బాబూ! ఓ గుంటని చూడమంటా వేఁటి ?"

"నా కెందికే ? నువ్వే మొగుణ్ని చూసుకో !"

"నా కున్నాడుగా ? నీకే...."

వినలేకపోయింది అన్నపూర్ణ. అంతులేని అసహ్యంతో చెవులు మూసుకుంది....

తగ్గుముఖం పట్టింది వర్షం. అప్పలమ్మ లేచి గోనెగుడ్డ నెత్తిమీద వేసుకుంది. ముసలాయన వీధిగదిలోకి వెళ్ళాడు గబగబా— వరండాలోకి వెళ్ళింది అన్నపూర్ణ.

* * *

"ఏం అప్పి రాలేదూ ? ఎందుకు రాలేదూ !" అంటూ తరిచి తరిచి అడిగాడు ముసలాయన, అంట్లు తోముకుంటోన్న అన్నపూర్ణని.

"నేనే మానిపించేశాను, వెధవ పనిమనుషులు వస్తారు; ఓ గడియ

వుండి పోతారు. నా చాకిరీ నాకు తప్పదు. చేతిలో ఆసరాగా ఓ పిల్లనే ఉంచుకుంటాను. మూడుపూటలా తిని ఇంట్లోనే పడివుంటుంది" అంది అన్నపూర్ణ గబగబా గిన్నెలు తొలుస్తూ.

"పిల్ల కుదిరిందా ?"

"అదే కుదురుతుంది."

"పోనీ అది కుదిరేవరకూ అప్పిని వుంచలేకపోయావ్ ? నీకు యిబ్బంది కదూ !"

"నాకేం యిబ్బందిలేదు. మీరు స్నానం చెయ్యండి. నీళ్ళు పెట్టాను" అన్నపూర్ణ రెండు చేతులనిండా గిన్నెలు పట్టుకుని వంటింట్లోకి వెళ్ళిపోయింది.

రెండురోజుల్లో రవణ కుదిరింది. దానికి పన్నెండేళ్ళు వుంటాయి. తొడలు బిగబడుతోన్న లాగూ .... జోలిలా వేల్లాడుతోన్న పెద్ద రవికా తొడుక్కుంది. వెంట్రుకలు సూదుల్లా మొహంమీదికి పడుతోంటే మాటి మాటికీ చెవుల వెనక్కి గెంటుకుంటూ నించుంది—దాని వాటం అన్నపూర్ణకేం నచ్చలేదుగానీ కాస్త తీర్చి దిద్దితే అదే బావుంటుంది_అని సరి పెట్టుకుంది.

ఓ గంటయ్యాక ఏవో చిన్నచిన్న పనులు చెప్పింది. చీకటి పడుతోంటే దాన్ని కాసిన్ని నీళ్ళుపోసుకోమని చెప్పి పెద్దపిల్ల పాతగౌను ఒకటి తీసి యిచ్చింది.

ఓ వారం అయ్యేసరికి రవణ చాలా పొందికలోకి వచ్చింది. శుభ్రంగా చురుగ్గా పనులన్నీ చేస్తోంది. అన్నపూర్ణ ప్రాణం తెరిపిన పడింది. "ఒసే నీకు గౌనులు బావులేదే! రెండు లంగాలు కుట్టించమని చెప్పవే మీ అమ్మతో. నేను వోణీలు కొంటాను. చిన్నచిన్న పైటలువేసుకుందువుగాని...." అంది.

రవణ సిగ్గుపడింది. ఆడవాళ్ళ పరిభాషలో దానికి 'ఈడొస్తోంది.'

దానికి ఉత్తగౌను తొడుక్కుంటే ఎబ్బెట్టుగానే కనపడుతోంది— "నాకు ఓ పరికిణీ ఉందమ్మా!" అంది గొప్పగా.

"అయితే ఇహనేం! తెచ్చుకో. ఆనక పెద్దబాబుకి క్యారియర్ తీసి కెళ్ళినప్పుడు మీ ఇంటికెళ్ళి అడిగి తెచ్చుకో"– అంది అన్నపూర్ణ. రవణ మూలంగా కొత్త సదుపాయం కూడా ఒకటి జరుగుతోంది. క్యారియర్ మనిషి వచ్చేసరికి ఆదరా బాదరా వండి పంపించక్కర్లేకుండా తాపీగా రవణే స్వయంగా తీసికెళుతోంది స్కూలుకి. అది మరీ సౌకర్యంగా ఉంది.

ఆ రోజు రవణ స్కూలునించి క్యారియర్ తిరిగి తీసుకు వచ్చి తెల్లగా తోమి బల్లమీదపెట్టి బొడ్లోంచి ఏమిటో తీసుకుని చప్పరిస్తూ కూర్చుంది. చంటిపిల్ల దాన్ని చూసి ఏడుస్తూ "అమ్మా నాకు అప్పచ్చి పెట్టవే"! అంటూ నిద్రపోతున్న అన్నపూర్ణ దగ్గరికి వెళ్ళి చెవిలో ఆరు నొక్క రాగం సాగించింది. చిరాగ్గా లేచిన అన్నపూర్ణ సంగతేమిటో తెలుసుకుని, "ఒసే రవణా! ఇలారా! ఏమిటి నువ్వు తింటోంది?" అంటూ కేక పెట్టింది.

రవణ ఒకసారి గట్టిగా చప్పరించి ఎంగిలిజీడీ తీసి మరీ చూపించింది.

"ఎక్కడిదే నీకు?"

"అబ్బాయిగా రిచ్చారమ్మా!"

"ఎవరూ? పెద్దవాడా? ఎప్పుడూ?

"ఇందాక బడిదగ్గర...."

"నువ్వడిగావా?"....

"ఉహూఁ"

అంతకన్న తర్కించలేదు అన్నపూర్ణ. ఏడుస్తోన్న చంటిదాని చేతిలో

కాస్త బెల్లం ముక్క పడేసి, మళ్ళాపడుకుంది. నిద్రపట్టలేదు. పెద్దవాణ్ణి అడిగేవరకూ ఆ ధ్యాస పోదనుకుంది. సాయంత్రం వాణ్నడిగితే 'ఇహిహి' అంటూ నవ్వేశాడు. "అందరూ కొనుక్కుతింటుంటే అది ఊరకే చూస్తోందమ్మా! పాపం తింటుందని...."

పెద్దవాడు కేవలం జాలిపడి ఇచ్చాడనుకుని సరిపెట్టుకో బుద్ధి కాలేదు, అన్నపూర్ణకి—ఐనా వాడి పసిమొహంచూస్తూ ఏమీ ఆలోచించనూ లేక పోయింది. "నువ్వు మాత్రం యింకెప్పుడూ అలా చెయ్యకు, దానికి లోకువ. నేను అప్పుడప్పుడూ అణా—అర్ధణా యిస్తూనే వున్నాను. అదే కొనుక్కుంటుంది" అని ఊరుకుంది.

రాత్రిళ్ళు పిల్లలు చదువుకునేటప్పుడు రవణ వాళ్ళ దగ్గిరజేరి బొమ్మలవీ చూస్తూ ఉంటుంది. ఆరోజు కూడా అలాగే వాళ్ళ దగ్గిర కూర్చుంది. పిల్లలు చదువులు ఆపేసి దాన్ని ప్రశ్నలు వేస్తూ కూర్చున్నారు.

"నీకు బొత్తిగా చదువురాదా? అయితే ఉత్తరాలవీ ఎలా రాస్తావు? సినిమాలవీ చూస్తే అర్థమవుతాయా?" అంటూ పెద్దవాడు ఆసక్తిగా ప్రశ్నల వర్షం కురిపిస్తున్నాడు.

"ఒరేయ్! నీ కేవిటా కబుర్లు దాన్తో!" అంటూ కొడుకుని తిట్టి "ఒసేయ్! నువ్విలారా! తాతగారి కంచంకడిగి బోర్లించు. వాళ్ళు చదువు కొంటూంటే అక్కడెందుకు నువ్వు" అంటూ గట్టిగా అరిచింది అన్న పూర్ణ—తనలో తనుమాత్రం 'వెధవ గోల' అనుకొంది. అన్నపూర్ణకి నచ్చని పనులు జరుగుతోంటే మాత్రం మహా యిబ్బంది పడిపోతుంది. మనశ్శాంతి పోగొట్టుకుంటుంది.

* * *

మిట్టమధ్యాహ్నం ఎండ ఎర్రగా కోపంగా ఉంది.

అన్నపూర్ణ పిల్లల్ని పడుకోబెట్టి తనూ పడుకొంది. బడికి శెలవు

కావటంచేత పెద్దవాడు కూడా యింట్లోనే ఉన్నాడు. గాలిపటమో ఏదో కట్టుకొంటూ కూర్చున్నాడు.

చేతిలో పుస్తకం వుండగానే నిద్రపట్టేసింది అన్నపూర్ణకి. పెరట్లో ఏవో పరుగులూ.... గంతులూ.... తృళ్ళిపడ్డట్టే లేచింది. బద్ధకించకుండా చటుక్కున వరండాలోకి వెళ్ళింది.

పెద్దవాడు రవణ జడ గట్టిగా పట్టుకొని పారిపోకుండా ఆపుజేస్తూ మీదిమీదికి ఒంగి నవ్వుతున్నాడు.

"ఒరేయ్! ఏమిట్రా అది?" ఒక్క అరుపు అరిచింది అన్నపూర్ణ. పెద్దవాడు, రమణా యిద్దరూ బిత్తరపోయారు. వాడు దాని జుత్తు వది లేశాడు. నెమ్మదిగా వస్తూ.... నవ్వుతూ.... "ఏమీ లేదమ్మా! చీపురు పుల్లలు తెమ్మంటే తేనని పరుగెడుతోంది. పట్టుకొన్నాను" అంటూ ఏమీ తెలియని వాడిలా మళ్ళా గాలిపటాల పనిలో నిమగ్నమయ్యాడు.

రవణ ఊరుకోలేదు—"అది కాదమ్మా! నేను సూత్తాకూచుంటే గ్లాసుడునీళ్ళు నా మీద పోసినారు.... నేను పరిగెత్తాను."

అన్నపూర్ణ దానికేసి చూస్తూనే ఉంది. దాని రవికంతా తడిచి బొత్తిగా గుండెలకి అతుక్కుపోయి .... దానికేసి పెద్దవాడు చూస్తోంటే అన్నపూర్ణ ఒళ్ళు చచ్చిపోయినట్టయింది.

అన్నపూర్ణకి విపరీతమైన కోపంకూడా వచ్చింది. "ఛీ! మీ వార సత్వం నాశనంగానూ! ఇక ఈ ఖర్మకి విముక్తి లేదట్రా? పోయిన పొద్దు గునా యిదే పాటా? పాడు బ్రతుకులు" అంటూ గబగబా లోపలికి వెళ్ళి ఫర్రున ఒక పాత చీర చింపి రెండు బారల గుడ్డముక్క తెచ్చి రవణ మీదికి విసిరింది.

"ఒసేవ్! అది అడ్డం వేసుకో. ఫో. యింటికి ఫో! చాలు, కొరి వితో నెత్తి గోక్కున్నట్టే వుంది."

రవణ తెల్లబోయి నించుంది. పెద్దవాడు బిగుసుకు పోయాడు.

అన్నపూర్ణ కొడుకుకేసి చూస్తూ విసురుగా అంది.

"నంగనాచి వేషాలు చాలుగానీ లేచివెళ్ళి రంగని పిల్చుకురా! శాస్త్రిగారింట్లోనే వుంటుంది. నేను రమ్మన్నానని చెప్పు. ఊఁ లేవ్వేం? లేచివెళ్ళూ— పాడు జన్మలు! ఎవరి ఖర్మకి ఎవరు కర్తలు? ఎవళ్ళని మాత్రం నే నడ్డగలనూ? మధ్య అనవసరంగా దానిమనస్సు బాధపెట్టాను నేనూ బాధ పడ్డాను. అది నిప్పులాంటి మనిషి—నిప్పులాంటి మనిషే! పోనీ—కాకపోతే కాకపోతుంది — అది దాని ఖర్మ!.... ఇది నా ఖర్మాను."

అన్నపూర్ణ కంఠం భారంగా మూసుకుపోయింది.

(1965 జనవరి "అభిసారిక" నుంచి)

★